Page No. 1 - Green    Page No. 1 - Red    Page No. 1 Black


# ఆర్డిటి

## ఎకాలజీ సెంటర్, అనంతపురం.

**ఈ మాసపు సమాచారం**    **సెప్టెంబరు 2005**

**FOR PRIVATE CIRCULATION ONLY**


## మీకు తెలుసా !

విత్తనాల లక్షణాలలో మార్పులు తీసుకువచ్చి, వాటిలో రోగ నిరోధక శక్తిని పెంచడానికి ముమ్మరంగా పరిశోధనలు చేస్తున్నారు. ఈసరికే మనదేశంలో పత్తి విత్తనాలు (బి.టి.పత్తి) వచ్చినాయి. పంటల సహజ లక్షణాలను మార్చడం తగదని, అవి మనుషులకు, ప్రకృతికి హాని చేస్తాయని పర్యావరణ వాదులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఇంగ్లాండు దేశంలోని శాస్త్రవేత్తలు తమ పరిశోధనాక్షేత్రంలో వంటనూనెకోసం పనికివచ్చే ఆవాల పంటలో రెండేళ్ళ క్రితం పరిశోధనలు చేశారట. ఆవాల పంటలో ఎంతవరకూ మార్పులు తీసుకువచ్చారో మనకైతే తెలియదుగానీ, దానిలో పెరిగిన కలుపు మొక్కల బెడదకు తలలుపట్టుకుంటున్నారు. ప్రయోగాలవల్ల ఆవాల పంటలో ఆవాలలాగా ఉండే కలుపుమొక్కతో పరస్పర ఫలదీకరణ చెంది, ఆ కలుపు మొక్క తన శక్తిని పెంచుకుని ఎంత బలమైన కలుపు నివారణ మందు ప్రయోగించినా చావడంలేదట. దీనిని నివారించడం దాదాపు అసాధ్యమేనంటున్నారు. అట్లాగే ఒక ఫ్రాన్సు శాస్త్రవేత్త తెలిపిన వివరాల ప్రకారం మొక్కజొన్న పంట పరిశోధనాక్షేత్రంలో పెరిగిన ఒక కలుపుమొక్క మొక్కజొన్న పంటకు అందజేసిన ప్రయోగ ఫలితాలను సంతరించుకుని బలంగా తయారయిందట. మొదట పరిశోధనా క్షేత్రంలో కేవలం కొన్ని మొక్కలుగానే ఉన్న ఈ కలుపు మొక్క అభివృద్ధి చెందుతూ కలుపు నివారణ మందులకు అతి వేగంగా లొంగకుండా ప్రమాదకరంగా అభివృద్ధి చెందుతూ ఉందట. ఇటువంటి ప్రయోగాల ద్వారా రైతులకు పనికివచ్చే విత్తనాలను అందించే మాట ఏమోగానీ ప్రయోగ విష ఫలితాల్ని మాత్రం ఉచితంగా ప్రపంచ వ్యాప్తంగా పంచిపెడుతున్నారు. వ్యవసాయ రంగంలో పెత్తనం చెలాయించడానికి బహుళజాతి సంస్థలు ఈలాంటి నిర్వాకాలు చేస్తున్నాయి. ఇపుడు మనకు తలనొప్పిగా తయారయిన వయ్యారిభామ కలుపు మొక్క కూడా పశ్చిమ దేశాల నుంచి దిగుమతి అయ్యిందే. ఇది కూడా ఈలాంటి అక్రమ సంతానమే కావచ్చు.

(హిందూ 28-7-05 ఆధారంగా)

**చిట్కా : గొంతు బొంగరు పోయినప్పుడు మిరియాలు, బెల్లం కలిపిన ఉండను బుగ్గన పెట్టుకుని రసం మింగుతూ ఉంటే ఉపశమనం కలుగుతుంది.**

## వ్యవసాయ కమీషన్ నివేదిక పరిచయం - 2

గత సంచికలో వ్యవసాయ కమీషన్ నివేదికను సంక్షిప్తంగా భూమికి సంబంధించిన సిఫారసుల వరకూ తెలుసుకున్నాం. ఈ మాసంలో మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

### 3. రుణాల పరపతికి సంబంధించిన సూచనలు :

రైతులకు, ముఖ్యంగా మెట్ట వ్యవసాయ రైతులకు మోయలేని రుణభారం రైతులపాలిట గుదిబండగా తయారయింది. మన జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులలో చాలామంది రుణభారం తట్టుకోలేక, అప్పులిచ్చిన వారిచేతిలో అవమానాలు భరించలేక, బ్యాంకు, సొసైటీ నోటీసులకు భయపడి ఆత్మహత్యలు చేసుకున్నవారున్నారు. వ్యవసాయాన్ని బతికించడం ప్రభుత్వాల బాధ్యత అయినట్టే, ఆ రైతులకు రుణపరపతి సౌకర్యాలను కల్పించడం కూడా ప్రభుత్వాల బాధ్యతే. చిన్న సన్నకారు రైతులకు గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకులలో, సొసైటీలలో అప్పులు దొరకక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారినపడి అసలుకంటే వడ్డీలే ఎక్కువ చెల్లిస్తున్నవారున్నారు. జాతీయ స్థాయిలో తీసుకున్న నిర్ణయాల్ని సమర్థవంతంగా కిందిస్థాయిలో అమలుపర్చాల్సి ఉందని కమీషన్ అభిప్రాయపడింది. అదునులో రైతులకు కావలసిన పంటల పెట్టుబడులకు అవసరమైన రుణ సదుపాయం కనీసంగానైనా ప్రభుత్వాలు కల్పించాలి. జాతీయ స్థాయిలో నాబార్డు బ్యాంకులద్వారా రైతులకు తక్కువ వడ్డీతో వ్యవసాయ రుణాలు అందించాలని బ్యాంకులకు సూచనలిచ్చినా, కింది స్థాయిలో బ్యాంకర్లు అధిక వడ్డీతో వ్యక్తిగత రుణాలకు వేసే వడ్డీతో రుణాలు ఇస్తున్నారు. దీని ఫలితంగా రైతులకు వడ్డీ భారం ఎక్కువ అవుతోంది. ఈ విధానాన్ని నియంత్రించి రైతులకు వ్యవసాయ రుణాల మంజూరులో సరళత పాటించాలని కమీషన్ అభిప్రాయపడింది. రైతులను రుణ విముక్తులను చేయడానికి కొన్ని సహాయక చర్యలు చేపట్టాలని కూడా కమీషన్ సిఫారసు చేసింది.

★ ఆపదలో ఉన్న రైతులకు తగిన సలహాలనివ్వడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైనును రైతులు రుణాలు పొందడానికి సహాయపడేందుకు వినియోగించాలి. రైతులకు రుణాలు ఇవ్వడానికి ఆటంకాలు సృష్టిస్తున్న బ్యాంకుల విషయంలో హెల్ప్‌లైన్ జోక్యం చేసుకుని రైతులకు సహాయపడాలి.

★ రిజర్వు బ్యాంకు, నాబార్డుల మద్దతుతో రాష్ట్రంలో విపత్తు నిధిని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలి. దీని ద్వారా నిరంతరం కరువు కాటకాలకు గురవుతున్న ప్రాంతాలలోని రైతులను ఆదుకోవడానికి, రైతులకు ఒకమేరకు రుణభారం తగ్గించడానికి ఇది సహాయపడుతుంది.

★ నాబార్డు, రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ భీమా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరిపి ఈ క్రింది విషయాలపట్ల అవి తగు నిర్ణయాలు తీసుకునేటట్లుగా కోరాలి.

★ రుణాల రీషెడ్యూలు చేసిన కాలంలో వడ్డీలు విధించరాదు. ఒక ప్రాంతాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించినపుడు రీషెడ్యూలుకు సంబంధించిన ఇతర అంశాలను మార్పు చేయకుండా వడ్డీని మాఫీ చేయాలి.

★ రైతు రుణాల చెల్లింపులో ఎట్టి పరిస్థితులలోనూ వడ్డీ అసలును మించరాదు. వడ్డీని అసలు మొత్తంలో కలపకుండా ప్రత్యేకంగా చూపెడుతూ ఉండాలి. వడ్డీ అసలును మించిన సందర్భాలలో బ్యాంకులు వాటంతటికవే అధిక వడ్డీని మాఫీ చేయాలి.

→

“భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది” ఉపనిషత్తులు

★ అన్ని పంట రుణాలపై వడ్డీని ఆరు శాతానికి తగ్గించాలి.

★ సమగ్రమైన పంటలభీమా పథకాన్ని విస్తరింపజేయడం అత్యంత అవసరం. చిన్న, సన్నకారు రైతులకు భీమా ప్రీమియం చెల్లింపులలో 50 శాతం రాయితీని కొనసాగించాలి.

★ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సమగ్ర భీమా పథకాన్ని సమకూర్చాలి.

1. ఈ విషయాలపట్ల ప్రభుత్వం ఈవరకే స్పందించింది. గత సంవత్సరం మన జిల్లాలో బ్యాంకులు అధిక సంఖ్యలో రుణాలు ఇవ్వడానికి జిల్లా అధికారులు విశేషంగా కృషి చేశారు, ప్రభుత్వం రుణ సౌకర్యం గ్రామీణ రైతులకు అందేలా, లాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆర్థిక సంస్థలు పనిచేయాలనే సూచనకు రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడానికి ప్రభుత్వం అంగీకరించింది. కిసాన్ క్రెడిట్ కార్డులు రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, సింగిల విండో క్లియరెన్సు ఏర్పాటు ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించాలని, నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని సరళతరం చేయాలని, లోను తీసుకున్నవారి సమాచారం బ్యాంకుదారులే పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలని కమీషన్ చేసిన సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. అదేవిధంగా కౌలు రైతులకు, గిరిజన రైతులకు కిసాన్ కార్డులు ఇచ్చేలోపు, గ్రామపంచాయితీ, స్వయం సహాయక గ్రూపులు, గ్రామ సంఘాలు, వాటర్‌షెడ్ కమిటీ, నీటి వినియోగ సంఘాలు, ఏజన్సీ ప్రాంతంలో గ్రామ సభలు ఏదైనా ఒకటి ఇచ్చే సర్టిఫికేట్ ఆధారంగా ఆర్థిక సంస్థలు రుణ సౌకర్యం కల్పించాలని చేసిన సిఫారసుకు ప్రభుత్వం మాత్రం గ్రామ పంచాయితీ కార్యదర్శి సర్టిఫికేట్ చెల్లేలాగున ప్రభుత్వం ఆమోదించింది.

2. రాష్ట్ర స్థాయిలోని బ్యాంకర్ల కమిటీలో రైతు ప్రతినిధులు, ప్రభుత్వేతర సంస్థలు ప్రతినిధులు, మూడు ప్రాంతాల జిల్లా కలెక్టర్లు సభ్యులుగా ఉండాలని, అదే విధంగా జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీలో వీరి ప్రతినిధులు ఉండాలని, జిల్లా స్థాయిలో రుణ పంపిణీలో కలెక్టర్లకు ఎక్కువపాత్ర ఉండాలని కమీషన్ అభిప్రాయపడింది. బ్లాక్ స్థాయి బ్యాంకర్ల కమిటికి రెవిన్యూ ఆర్‌డిఓ అధ్యక్షత వహిస్తూ పర్యవేక్షించాలని కూడా కమీషన్ సిఫారసు చేసింది. ఈ సూచనలన్నింటిని ప్రభుత్వం అంగీకరించింది.

3. రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీలో వ్యవసాయ సబ్‌కమిటీ క్రమం తప్పకుండా రైతులకు కావాల్సిన రుణ అవసరాలను అంచనా వేస్తుండాలి. రుణాలు పొందాల్సిన చిన్న, సన్నకారు రైతుల సంఖ్యను ఈ సబ్ కమిటీ నిర్ణయించాలి. రుణ పంపిణీలో వీరికి ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని మండలాల్లోనూ, ముఖ్యంగా కరువు ప్రాంతాలో అంచనా వేయాలని కమీషన్ అభిప్రాయపడింది. ఈ విషయాల్ని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ దృష్టికి తెస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

4. హామీతో నిమిత్తం లేకుండా ఇచ్చే రుణ పరపతిలో రిజర్వు బ్యాంకు ఆదేశాలను ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలి. ఎంత మంది రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్నదీ, ఎంతమందికి మంజూరు చేసినది కూడా తెలుపాలని కమీషన్ కోరింది. పంటల కోసమేకాక, పాడి పరిశ్రమకు, చేపల పెంపకానికి, ఇతర వ్యవసాయాధారిత కార్యక్రమాలకు కూడా రుణ సౌకర్యం కల్పించాలి. వ్యవసాయపనులు ప్రారంభించడానికి ముందే రుణాలు అందించాలని, పంటలు రుణాల మంజూరులో 20 శాతం మార్జిన్ మనీ కోసం బ్యాంకులు పట్టుపట్టరాదని కమీషన్ సూచించింది. ఈ విషయాలన్నింటిని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల దృష్టికి తీసుకోపోవడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది.

5. ప్రతి మండల స్థాయిలో రైతులనుండి వచ్చే ఫిర్యాదులను పరిశీలించడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ వ్యవస్థ ఎమ్మార్వోల పర్యవేక్షణలో గ్రామ పంచాయితీల ద్వారా పనిచేయాలని కమీషన్ చేసిన సూచనలను ప్రభుత్వం అంగీకరించింది.

6. తరచుగా కరువుకు గురయ్యే ప్రాంతాలను ఆదుకోవడానికి ఒక విపత్కర నిధిని రిజర్వు బ్యాంకు, నాబార్డు సహాయంతో ఏర్పాటు చేయాలని, ఈ నిధి ద్వారా అప్పుల భారాల్లో ఉన్న రైతులకు సహాయం చేయాలని, భూ సంస్కరణల ద్వారా భూమి లభించే పేద రైతులకు రుణ సౌకర్యం కల్గించడానికి కూడా ఈ నిధి ద్వారా గ్యారంటీ ఇప్పించాలని కమీషన్ చేసిన సూచనలను ప్రభుత్వం ఆమోదించింది.

7. అన్ని బ్యాంకులు, సహకార సంస్థలు వ్యవసాయ రుణాలకు ఒకే విధమైన వడ్డీ విధించాలని, ప్రస్తుత పరిస్థితులలో ఇది ఆరు శాతంగా ఉండాలని, భవిష్యత్తులో స్వల్పకాలిక డిపాజిట్లకు బ్యాంకులు మనకిస్తున్న వడ్డీ కంటే అధికంగా రెండు శాతానికి మించరాదని కమీషన్ సిఫారసు చేసింది. ప్రస్తుతం బ్యాంకులు మూడు నెలలకొకసారి వడ్డీని అసలుకలిపే విధానాన్ని స్వస్తి పలకాలి. సకాలంలో రుణాలు చెల్లించినవారికి వడ్డీలో రాయితీ ఇవ్వాలని, ఎట్టి పరిస్థితులలోను, వడ్డీ అసలుకు మించరాదని, కరువు ప్రాంతాలలో వడ్డీ మాఫీ చేయాలని రుణాలను రీషెడ్యులు చేయాలని కమీషన్ సూచించింది. ఈ సూచనలన్నింటినీ ప్రభుత్వం ఆమోదించింది.

8. వాస్తవంగా దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటూ హెల్ప్‌లైనును అభ్యర్థించిన రైతులకు 50 వేలు రుణ సౌకర్యం కల్పించాలన్న కమీషన్ సూచనను ప్రభుత్వం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల దృష్టికి తీసుకువెడతానని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

9. కరువు ప్రాంతాలలో రుణ వ్యవస్థకు ప్రత్యేక తరహా బ్యాంకు బ్రాంచీలను ఏర్పాటు చేయాలని, ఈ అంశాన్ని రిజర్వు బ్యాంకు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళాలన్న కమీషన్ సూచనను ప్రభుత్వం అంగీకరించింది.

10. రైతులందరికీ అన్ని పంటలకు వర్తించేలా పంటల భీమా పథకాన్ని నిర్వహించాలని, చిన్న, సన్నకారు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం 50 శాతం రాయితీ ఇవ్వాలని, రైతులు చెల్లించే ప్రీమియం, పంట విలువలో మూడు శాతానికి మించి పెరగరాదని, భీమా నష్టపరిహారం లెక్కించే విధానం రైతుకు సహాయకారిగా ఉండాలని, క్లెయిములు 60 రోజుల్లోగా చెల్లించాలని కమీషన్ సూచించింది. ఈ సూచనలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం సంబంధిత సంస్థల దృష్టికి తీసుకువెళ్తానని ప్రభుత్వం హామీనిచ్చింది.

**(ఇంకా వుంది)**

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఏకాలజి**

## నీతి వాక్యం :

చు॥ ఉడుముండదే నూరేండ్లును
బడియుండదే పేర్మిఁబాము పదునూరేండ్లున్
మడువునఁ గొక్కెరయుండదే
కడు నిలఁబురుషార్థపరుడు కావలె సుమతీ !

**తాత్పర్యము :** ఓ మంచి బుద్ధిగలవాడా ! ఉడుము నూరు సంవత్సరాలు, పాము వేయిసంవత్సరాలు, కొంగ చాలాకాలం జీవించి ఉంటాయి. కానీ వాటివల్ల ఏ ప్రయోజనంలేక నిరుపయోగంగా ఉంటాయి. కాబట్టి అత్యంత శ్రేష్టమైన మానవజన్మ ఎత్తిన మనిషి ధర్మార్థ కామమోక్షములందు ప్రీతి కలిగిన వాడై ఉండవలయును. లేని యెడల పాము, ఉడుము, కొంగలవలె జీవితం నిరర్థకమవుతుంది.

**చర్చ :**

ఈ సృష్టిలో కోట్లాది జీవరాసులు ఉన్నాయి. ప్రకృతి ధర్మాల్నిబట్టి ప్రతి జీవి మనుగడ సాగించడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. పాములు, తేళ్ళు, విషపు ప్రాణులని వాటిని చూడగానే తెలుసుకుంటాము. విషాన్ని కలిగి ఉండడం, కుట్టడం వాటికున్న ప్రకృతి ధర్మాలు. అట్లాగే ప్రకృతిలోని క్రిమికీటకాల నుంచీ, మహాకాయంగల ఏనుగు వరకూ వాటి ప్రకృతి ధర్మాలతో బతుకుతూ ఉంటాయి. ఇటువంటి ప్రాణులలో ఉడుములు నూరు సంవత్సరాలు, పాములు వేయి సంవత్సరాలు, కొంగలు దీర్ఘకాలం బతుకుతాయని శతకకారుడు చెబుతున్నాడు. కేవలం సుదీర్ఘ కాలం బతకడం గొప్పకాదని, ఏ ఉపయోగం లేకుండా నిరర్థకంగా బతకడం కంటే, జీవితం ఉన్నంతలో పదిమందికి ఉపయోగపడే పనులు చేసి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని శతకకారుడు మనల్ని ఉపదేశిస్తున్నాడు.

సృష్టిలోని ప్రతి ప్రాణి తన సహజ లక్షణాలనుబట్టి ప్రవర్తిస్తుంది. అన్ని ప్రాణులకంటే ఉత్తమమైనదిగా భావిస్తున్న మనిషి మాత్రం సహజలక్షణాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు. పామును చూస్తే విషపు పురుగు అని జాగ్రత్తగా ఉంటాం. గొర్రెను చూసి సాధుజంతువని ఏ ప్రమాదం ఉండదని వెంటేనే భావిస్తాం. కానీ మనిషిని చూసి అనుభవంలో తప్ప మంచివాడో, చెడువాడో నిర్ధారించలేం. ప్రకృతిపట్ల, ఇతర జీవరాసులపట్ల సద్బుద్ధి, సత్ప్రవర్తనగా మెలగడం, సాధ్యమయినంతవరకూ ఇతరులకు సహాయకారులుగా ఉండడం మనుషులకు సహజ లక్షణంగా ఉండాలి. ఈ సహజలక్షణాల్ని మనం పాటిస్తునామా ? మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. అందుకే దారితప్పిన మనిషిని సన్మార్గంలో నడిపించడానికి సాధువులు, సన్యాసులు, ప్రవక్తలు, బైరాగులు జీవిత సత్యాల్ని బోధించే ప్రయత్నాలు చేస్తున్నారు. భౌతికంగా ఎన్ని సంపదలు కూడబెట్టినా, ఎన్ని ఉన్నతమైన పదవులు చేపట్టినా, తాత్వికంగా మనిషి తన ధర్మాలను తెలుసుకోకపోతే, ఆ మనిషిది నిరర్థక బతుకేనని మనం భావించాలి. ధనసంపదలతో పెరిగిన ఆధునిక వైద్యవిజ్ఞానంతో ఆయుస్సును పొడిగించుకోవచ్చు. కానీ మనిషిగా, మానవ విలువలతో ఎంతకాలం బతికినాడన్నదే ప్రధానమైనది.

**వై.వి. మల్లారెడ్డి**

## మహిళా సదస్సు

19-8-2005 తేదీన యాక్షన్ ఫ్రాటర్నా ఆర్డీటి ఎకాలజి సెంటర్‌లో మహిళా సదస్సు నిర్వహించడం జరిగింది.

జలజీవని వాటర్‌షెడ్స్ అయినటువంటి భద్రాపురం, భానుకోట, పాలవాయి, Plus W.S. సింగంపల్లి, సింగంపల్లి తాండా, యాలేరు గ్రామాలలోని సంఘ సభ్యులు మొత్తం 68 మంది సదస్సుకు హాజరు కావడం జరిగింది.

జలజీవని, జీవనోపాధుల పథకం ద్వారా రుణాలు తీసుకోవడం, తిరిగి కట్టడం ఎటువంటి లాభాలు పొందినారు అనే అంశాలను వివరించడం జరిగింది.

గొర్రెలు, ఆవులు, ఎనుములు, బుట్టల అల్లకం, హోటలు, అంగడిలాంటి కార్యక్రమాలకు రుణాల ద్వారా కొనసాగిస్తున్నారు. వీటితోపాటు క్రొత్తగా అగరబత్తి కార్యక్రమాన్ని కూడ మొదలుపెట్టడం జరిగింది.

తీసుకున్న అప్పులను సకాలంలో (కంతువారిగా) వడ్డీతో సహా చెల్లిస్తూన్నారు. డబ్బుకట్టని పక్షంలో జరిమాన విధించడం జరుగుతోంది.

కొన్ని కట్టుబాట్లు పటిష్టంగా పెట్టుకొని వాటిని అమలు చేస్తున్నారు, కాబట్టి వీరు అనుకున్న సమయంలో అప్పు కడుతున్నారు.

అని గ్రామాలలోని సంఘ సభ్యులు కట్టుబాట్లు సక్రమంగా నిర్వహించినట్లు ; తెలుస్తున్నది. అందరికి అన్ని విషయాలు తెలపడం / తెలియజేయడం వుంటే (గ్రూపుకు సంబంధించిన అంశాలు) సంఘం పనితీరు మరియు పటిష్టంగా వుండుటకు దోహదపడుతుంది. అనే అంశాలను ఈ గ్రామాలవారు తెలియజేయడం జరిగింది.

## వేరుశనగ పైరులో అంతరకృషి

వేరుశనగ విత్తిన 45 రోజుల వరకు పైరును కలుపు మొక్కలబారి నుండి కాపాడవలసి ఉంటుంది. విత్తిన 45 రోజులలోపు ఎలాంటి కలుపు మొక్కలు లేకుండ చూడాలి. విత్తిన 45 రోజులలోపల దంతి సేద్యము మరియు మెట్ల సేద్యం చేయాలి. మెట్లు పోయినపుడు మొక్క మొదళ్ళకు మట్టిని ఎగదోసే విధంగా చూడాలి.

విత్తిన 45 రోజుల తరువాత ఏ విధమైన అంతరకృషి చేయరాదు. ఒక వేళ చేసిన ఊరడలు దెబ్బతిని దిగుమతి తగ్గుతుంది.

## వేరుశనగ పైరులో ఆకు మచ్చ తెగులు

వాతావరణంలో తేమ శాతం ఎక్కువ ఉండి, ఉష్ణోగ్రత తక్కువగ ఉండి అడపాదడపా వాన జల్లులు కురుస్తూంటే ఆలస్యంగావచ్చు ఆకుమచ్చ తెగులు పైరును ఆశించుతుంది. దీనిని తొలిదశలో గమనించి సస్యరక్షణచే పట్టితే నష్టం తక్కువగా ఉంటుంది. లేనిచో వాతావరణం సహకరించనిచో 60 - 70 శాతం వరకు పంట దిగుబడి తగ్గి, మేత నాణ్యత కూడా తగ్గుతుంది. ఈ తెగులు ఆశించిన ఆకులు పైరు పక్వమునకు రాకుండగానే రాలిపోయి వేరే కీడుచేయు శిలీంద్ర ఉత్పత్తులకు దోహదకారి అవుతుంది. ఈ తెగులు పైరు, విత్తిన 70-80 రోజుల మధ్యన మొదలౌతుంది. అనగా సెప్టెంబరు ఆఖరు వారం, అక్టోబరు మొదటి రెండు మూడు దినముల మధ్యన. ఈ సమయంలో పైరుపై వేప గింజల కషాయంతో ఒకసారి, మరియు వేపనూనెతో రెండవసారి పైరుపై పిచికారి చేసిన ఈ తెగులు అదుపులో ఉంటుంది.

# ఈ మాసంలో వ్యవసాయం

## పచ్చి మేత ప్రాముఖ్యత

వ్యవసాయానికి ఏర్పడుతున్న ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా, పాడి పరిశ్రమ మీద రైతులకు శ్రద్ధ పెరిగింది. ఇటీవల దాణా పదార్థాల ఖరీదు పెరిగిపోవడంతో, పశుగ్రాసాల మీద దృష్టి మరల్చవలసిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం సరాసరిన మన జిల్లాలో ప్రతి రైతు కేవలం 3 శాతంకన్నా తక్కువ భూమిలో మాత్రమే పశుగ్రాసాన్ని పండిస్తున్నాడు. కానీ ఇది చాలదు. ఇది 10 శాతానికి పెరగాలి.

పాడికి ఆధారం పచ్చిమేత, అంతేకాదు. పచ్చిమేతతోనే పాడి లాభదాయకం. దాణాతో పాడి ఖరీదు. రైతుకున్న భూమిలో పశుగ్రాసాలసాగు చేపట్టడానికి ముందు జాగ్రత్తలు కొన్ని తీసుకోవాలి. నేల స్వభావం, నీటివసతి, వాతావరణం, పశువుల సంఖ్య మొదలగు వాటిని దృష్టిలో పెట్టుకోవాలి. అంతేకాకుండా, పశుగ్రాసాన్ని ఎండు చొప్పలాగా నిల్వ చేసుకోవాలా లేక పాతర గడ్డిగా నిల్వ చేసుకోవాలా అని ఆలోచన చేయాలి.

1. పశుగ్రాసాల్లో విటమిన్-ఎ ఎక్కువగా ఉంటుంది. ఇది పాల ఉత్పత్తికి, పునరుత్పత్తికి కంటి చూపుకు చాలా అవసరం.
2. పశుగ్రాసాలను మిశ్రమ పంటలుగా సాగు చేసుకోవచ్చు. పండ్ల తోటల్లో అంజన్‌గడ్డి, స్టైలో హెమటా గడ్డి పెంచుకోవచ్చు.
3. పచ్చిమేతను అంతర పంటలుగా పెంచవచ్చు. వరి కోసిన తరువాత, ఆ భూమిలో పిల్లి పెసర, జనుము లాంటివి సాగు చేసుకోవచ్చు.
4. ఎండు చొప్పగా నిల్వ చేసుకొని పశుగ్రాసాన్ని వాడుకోవచ్చు. ఉదా: వరి, జొన్ని చొప్ప, మొక్కజొన్న చొప్పలాంటివి.
5. పశుగ్రాసాలు అధికంగా ఉన్నప్పుడు వాటిని పాతర గడ్డిగా నిల్వ చేసుకొని కరువు సమయాల్లో వాడుకోవచ్చు.
6. పశుగ్రాసాల్లో ఉన్న పీచు పదార్థం పాలల్లో వెన్న శాతం పెరగడానికి దోహదపడుతుంది.
7. పశుగ్రాసాన్ని చిన్న ముక్కలుగా కత్తిరించి మేపుకున్నట్లయితే వృధాను తగ్గించవచ్చు.
8. దాణా పదార్థాల మేపుదల పశుగ్రాసాల మేపుదల కంటే ఖరీదు.
9. అజోల్లా దాణా బదులు వాడచ్చు, ఖర్చు తక్కువ.
10. బహువార్షిక పశుగ్రాసాలను సాగు చేసుకున్నట్లయితే 3-4 సంవత్సరాల వరకు కొరత ఉండదు.

### పశువులకిచ్చే మేత పదార్థాలు రెండు రకాలు

1. పీచు పదార్థాలు 2. దాణా పదార్థాలు.

పీచు పదార్థాలను పచ్చిమేతగానూ, ఎండు మేతగానూ వాడుతారు. పశువులను మేపే పీచు పదార్థాలలో 2/3 వంతు పచ్చి మేతగానూ. 1/3 వ వంతు ఎండు గడ్డిగా మేపుకోవాలి. ముఖ్యంగా పచ్చిమేత రెండు రకాలుగా విభజింపబడినది. ఒకటి ఒకటి కాయజాతికి చెందిన పశుగ్రాసము, ఉదా : లూసర్న్, పిల్లిపెసర, అలసంద, స్టైలో హెమాటా మొదలగునవి. రెండవది గింజజాతి పశుగ్రాసాలు ఉదా : జొన్న, మొక్కజొన్న, సజ్జ ఇతర బహువార్షిక రకాలయినటువంటి కో-1, కో-2, హైబ్రిడ్ నేపియర్, మొదలగునవి.

పాడి పశువుల్లో పాల ఉత్పత్తికి పచ్చిమేత చాలా ముఖ్యమైనది. పశువుల మేతలో 2/3 వంతు కాయ జాతికి సంబంధించిన పశుగ్రాసాలు, 1/3 వంతు గింజ జాతికి సంబంధించిన పశుగ్రాసాన్ని మేపాలి. ఉదాహరణకు 100 కిలోల పచ్చిమేతలో 67 కిలోల అలసంద+33 కిలోల జొన్న మేపుకుంటే మంచిది. పాడి పశువుకు పచ్చిమేత ముఖ్యంగా కాయ జాతి పచ్చిమేత బాగా మేపితే, సుమారు 7-8 కిలోల పాల ఉత్పత్తి వరకు దాణా మేపనవసరంలేదు. చాలా మంది రైతులు వాళ్ళ పశువులకు కేవలం ఎండు మేతతో సరిపెడుతుంటారు. ముఖ్యంగా వరిగడ్డి, జొన్న చొప్ప మొదలగునవి. వీటిలో పోషక విలువలు తక్కువ. పశువులకు కేవలం కడుపు నింపడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఇలా కాక, ఈ ఎండుచొప్పను యూరియా ద్రావకంతో సుపోషకము చేసుకొని మేపుకున్నట్లయితే ఫలితముంటుంది. 4 కిలోల యూరియాను 60 లీటర్ల నీళ్ళతో కలిపి, 100 కిలోల ఎండు గడ్డిని పొరలు పొరలుగా పరచి, వాటిపై ఈ యూరియా ద్రావకాన్ని చల్లాలి. గాలి చొరపడకుండా, సిమెంట్ వరల్లో తొక్కిపెట్టి 15 రోజుల తర్వాత ఈ యూరియా ఊరవేసిన గడ్డిని పశువులకు మేపుకోవచ్చు.

ముందుగా రైతు పశుగ్రాసాల సాగు అధిక విస్తీర్ణంలో సాగు చేసే ముందు ఈ క్రింది తెలిపిన సూచనలు తెలుసుకుంటే మంచిది. రోజుకు ఒక పశువుకు 30-40 కిలోల పచ్చిమేత అవసరముంటుంది. అంటే సంవత్సరానికి ఒక్కోపశువుకు సుమారు 12-14 టన్నుల పచ్చిమేత అవసరముంటుంది. అందుకే నీటివసతి ఉన్నట్లయితే, బహువార్షిక పశుగ్రాసాలయినటువంటి, పారాగడ్డి, గిన్నీగడ్డి, హైబ్రిడ్ నేపియర్ మొదలగునవి సాగు చేసుకోవాలి.

నీటి వసతిగల ఒక ఎకరం భూమిలో పండించిన పచ్చిమేత 4-5 పశువులకు సరిపోతుంది. వర్షాధారము క్రింద అయితే రెండు పశువులకు సరిపోతుంది. అధిక పాలదిగుబడినిచ్చే 5-6 పశువులను ఒక ఎకరంతో పండించే పశుగ్రాసంతో మేపుకున్నట్లయితే, సంవత్సరానికి ఆదాయం సుమారు 30-35 వేల రూపాయల ఆదాయం వస్తుంది. అదే వాణిజ్య పంటలకైతే కేవలం 15-20 వేల రూపాయల ఆదాయం వస్తుంది.

ఒకటి లేదా రెండు పాడిపశువులున్న రైతులు తమ పొలం గట్ల వెంబడి, ఇంటి చుట్టూ సుబాబుల్ లేదా అవిశ లాంటి పశుగ్రాసపు చెట్ల రకాలను వేస్తే రోజుకు 10-12 కిలోల పచ్చిమేత సంవత్సరం పొడుగునా లభిస్తుంది. ఎక్కువ పాడి పశువులున్న రైతులు తమకున్న భూమిలో కనీసం 10వ వంతులో పచ్చిమేతను పెంచాలి. అర ఎకర భూమిలో నీటి ఆధారంగా పండించే పశుగ్రాసాలతో రెండుపాడి పశువులను లాభసాటిగా పోషించవచ్చు.

పచ్చిమేత పుష్కలంగా ఉన్నప్పుడు, దానిని చిన్న ముక్కలుగా కత్తిరించి పాతరగడ్డి (సైలేజి)గా తయారు చేసుకొని, కరువు సమయాల్లో మేపుకున్నట్లయితే, వేసవిలో పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చును. పాడి పశువుల పోషణలో సాధ్యమయినంత వరకు ఒక్క పచ్చి మేతతోనే మేపుకుంటే మంచిది. లెగ్యూమ్ జాతి అలసంద, పెసర, సుబాబుల్ మొదలైన పశుగ్రాసాల్లో ఉండే మాంసకృతులు అధిక పాల దిగుబడికి, నాన్ లెగ్యూమ్‌జాతి (జొన్న, సజ్జ, నేపియర్ మొదలగునవి) పచ్చిమేతలో ఉన్న పీచు పదార్థాలు పాలలోని వెన్న శాతం పెంచడానికి అవకాశముంది. కాబట్టి, పాడి పరిశ్రమలో ప్రతి రైతు పశుగ్రాసాలతోనే లాభం పొందాలి.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990